మహాత్ముడి మార్గం.. అనుసరణీయం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, తదితరులు


పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : మహాత్మా గాంధీ ఆచరించిన అహింసామార్గం అనుసరణీయమని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారికంగా గాంధీ జయంతిని నిర్వహించారు. జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంతో పర్యావరణం కాపాడాలని సూచించారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీపీఆర్వో తిరుమల, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎండకు తాళలేక.. నీడపట్టున పక్షి



వాతావరణంలో అనూహ్య మార్పులతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. మధ్యాహ్నం ఎండ వేడికి విపరీతమైన ఉక్కపోతగా ఉంటోంది. పెరిగిన ఉష్ణోగ్రతలతో మనుషులే కాదు పశుపక్ష్యాదులు సైతం ఇబ్బందులకు గురవుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణచౌక్ - వినాయక్ కూడలి మార్గంలో ఓ పక్షి ఎండకు తాళలేక ఓ ద్విచక్ర వాహనం నీడన సేదతీరింది. **- ఈనాడు, ఆదిలాబాద్**

ప్రభుత్వ బడిలో చదివి.. అదే బాటను ఎంచుకుని



వారంతా పేద కుటుంబాలకు చెందిన వారే. చదివింది సర్కారు బడుల్లోనే. ఇప్పుడు ఆ బడుల్లో చదివే విద్యార్థులకే పాఠాలు బోధించబోతున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ, ఎస్ఏ పోస్టులకు ఎంపికైన వారిలో అత్యధికులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. తమకు ఇష్టమైన కొలువు కోసం పట్టుదల, సాధించాలనే తపనతో లక్ష్యంపై గురి పెట్టారు. అనుకున్నది సాధించారు. కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకున్నారు. పేద విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అంటున్న వారి నేపథ్యం ఒకసారి పరిశీలిస్తే..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం, పాలనాప్రాంగణం

వ్యవసాయం చేస్తూ.. కుటుంబ భారం మోస్తూ



ఆదిలాబాద్ మండలం అంకోలి గ్రామానికి చెందిన కల్యాణం లక్ష్మి-రాజన్న దంపతుల కుమారుడు సతీష్ స్కూల్ అసిస్టెంట్ బయోలజికల్ సైన్స్ విభాగంలో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు సాధించి ఏళ్ల నాటి కలను సాకారం చేసుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన 2008లో బీఈడీ పూర్తి చేశారు. 2012లో తండ్రి మరణించడంతో కుటుంబ బాధ్యతలను చేపట్టారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఎలాంటి శిక్షణ లేకుండానే స్థానిక గ్రంథాలయంలో డీఎస్సీ కోసం సన్నద్ధమయ్యారు. వివాహం తర్వాత కూడా కుటుంబ కష్టాలను అధిగమించి కొలువు సాధించడంతో గ్రామస్థులు అభినందిస్తున్నారు.

కూలీ కొడుకులు..



ఆదిలాబాద్ పట్టణం ఇంద్రానగర్‌కు చెందిన అన్నాదమ్ములు వాగ్మారే రవి, నర్సింగ్‌లు డీఎస్సీ స్కూల్‌అసిస్టెంటు ఫలితాల్లో సత్తా చాటారు. మాతృభాష మరాఠీ మాధ్యమంలో చదివారు. అదే మాధ్యమం బయోసైన్సులో నర్సింగ్ జిల్లాస్థాయి మొదటి ర్యాంకును సాధించగా.. రవి ఫిజికల్‌సైన్సులో రెండో ర్యాంకు దక్కించుకుని స్కూల్‌అసిస్టెంటు పోస్టులకు ఎంపికయ్యారు. తండ్రి నాందేవ్ కూలీ కాగా.. ప్రాథమిక విద్య మొదలుకొని ఇంటర్ వరకు పట్టణంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో చదివారు. కుటుంబ పరిస్థితిని గమనించి కష్టపడి చదివి ఒకే ఇంట్లో ఇద్దరు కొలువులు కొట్టి చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించారు.

అప్పుడు తమ్ముడు.. ఇప్పుడు అన్నయ్య



ఆదిలాబాద్ మండలం అంకోలి గ్రామానికి చెందిన సుంకరి దేవిదాస్ కుమారుడు మచ్చేందర్ బయోలాజికల్ సైన్స్ విభాగంలో జిల్లాస్థాయిలో 4వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంటుగా ఎంపికయ్యారు. మచ్చేందరిది వ్యవసాయ కుటుంబం కావడంతో వ్యవసాయంలో తండ్రికి చేదోడుగా ఉంటూనే ఉపాధ్యాయ కొలువు కోసం సన్నద్ధమయ్యారు. తమ్ముడు హరిదాస్ ఇది వరకే ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. ఇప్పుడు మచ్చేందర్ కొలువు సాధించడంతో ఆ కుటుంబంలో సంతోషం రెట్టింపైంది. తన కష్టానికి సరైన ఫలితాన్ని కుమారులు అందించారని తండ్రి దేవిదాస్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి కల సాకారం..



జైనథ్ మండలం గూడ గ్రామానికి అమ్మ నర్సమ్మ - పొచ్చన్న దంపతుల కుమారుడు అమ్మ శంకర్ 58వ ర్యాంకు సాధించి ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. చిన్నతనంలోనే తన తండ్రి మరణించడంతో అమ్మ అండతో కష్టపడి చదివారు. కానీ తన కుమారులను ఉపాధ్యాయులుగా చూడాలన్న తండ్రి కలను సాకారం చేశారు. అన్నయ్య శ్రీకాంత్ గతంలోనే ఉపాధ్యాయ కొలువు సాధించారు. తండ్రి స్థానంలో నిలిచి తన తమ్ముడు ఉద్యోగం సాధించేలా అండగా నిలిచారు. తన తండ్రి తమ నుంచి దూరమైనా ఉపాధ్యాయుడిగా చూడాలన్న కలను నెరవేర్చడం సంతోషంగా ఉందని శంకర్ చెబుతున్నారు.

పోలీసు నుంచి మాస్టారుగా..



బేల పోలీసు స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కలముదురు రాఘవేంద్ర తాజాగా ఎస్జీటీగా ఎంపికయ్యారు. డీఎస్సీ ఫలితాల్లో జిల్లాస్థాయిలో 137 ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నారు. బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్‌కి చెందిన రాఘవేంద్ర సోదరుడు రవి ఆర్మీ జవానుగా పని చేస్తున్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని 2020లో పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు ఉపాధ్యాయ కొలువు దక్కించుకున్నారు. గ్రూప్-2 ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. తల్లిదండ్రులు లింగన్న-గంగాబాయిది వ్యవసాయ నేపథ్యం కాగా.. కుమారులను సర్కారు బడుల్లో చదివించి ప్రయోజకులయ్యేలా తోడ్పాటునందించారు.

113 మంది అభ్యర్థుల హాజరు



డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన పర్యవేక్షిస్తున్న డీఈవో ప్రణీత

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. తొలిరోజున సందేశాలు రాత్రి వేళ రావడంతో రెండోరోజున వారంతా ధ్రువపత్రాల పరిశీలనకు తరలివచ్చారు. ఎస్జీటీ పోస్టులకు ఎంపికైన వారిని 1:3 ప్రాతిపదికన పిలవగా.. 113 మంది అభ్యర్థులు వచ్చారు. బుధవారం రాత్రి స్కూల్ అసిస్టెంటు, పీఈటీ అభ్యర్థులకు సైతం డీఎస్సీలో ఎంపికైనట్లు చరవాణికి సందేశాలు వచ్చాయి. ఏర్పాట్లను డీఈవో ప్రణీత పర్యవేక్షించారు.

నేటి నుంచి ప్రయోగాత్మకంగా డిజిటల్ సర్వే

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : జిల్లాలో డిజిటల్ కార్డుల జారీకి ప్రయోగాత్మక సర్వే ప్రారంభం కానుంది. జిల్లాలో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో రాంనగర్(వార్డు నెం.11), ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోహర, గుడిహత్నూర్ మండలం గోండు అర్కపూర్, ఇచ్చోడ మండలం అడెగాం-బిలో ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు రాజర్షిషా పేర్కొన్నారు. అయిదు రోజుల పాటు సాగే ఈ సర్వేలో ఎంపిక చేసిన వార్డు, గ్రామాల ప్రజలు పాల్గొనాలని కోరారు. అధికార యంత్రాంగం అడిగే సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వేపై కలెక్టరేట్‌లో అధికారులకు అవగాహన కల్పించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఆర్డీవో వినోద్‌కుమార్, బోథ్‌కు జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డిని ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు.

ఏకరూప దుస్తులపై సమీక్ష: దసరా సెలవులు పూర్తయ్యే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందేలా చూడాలని పాలనాధికారి రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బీసీ గురుకులాల విద్యార్థులకు దుస్తులు అందకపోవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో ఆ శాఖ అధికారుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆయా శాఖల అధికారులను పిలిపించి సమీక్ష నిర్వహించారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి, డీఆర్‌డీవో సాయన్న, మెప్మా పీడీ మమత, సెక్టోరల్ అధికారి సుజాత్‌ఖాన్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆటా పాటా.. వేడుకల బాట

సంస్కృతి, సంప్రదాయాలపై వైద్యవిద్యార్థుల కార్యక్రమాలు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

ప్రభుత్వ వైద్యకళాశాల మంచిర్యాల.. భారాస ప్రభుత్వం తొలి విడతగా ఏర్పాటు కళాశాలల్లో ఇది ఒకటి. బహుశా వైద్యవిద్య అభ్యసించే వారికి, వైద్యవృత్తిలో ఉన్నవారికి తప్పితే ఇక్కడి కళాశాల తెలిసింది చాలా తక్కువ మందికే. కానీ మొదటి సంవత్సరం లోనే రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. తొలి ఏడాది పరీక్ష ఫలితాల్లో 98 శాతంతో తొలి స్థానంలో నిలిచింది. రెండేళ్లు(రెండు బ్యాచ్‌లు)పూర్తిచేసుకుని మూడో బ్యాచ్(ఏడాది)కి సిద్ధమవుతోంది. కేవలం చదువుకే పరిమితం కాకుండా.. నిత్యం పుస్తకాలతోనే కుస్తీ పట్టి ఒత్తిడికి గురికాకుండా ఆటాపాటలతో ఉపశమనం పొందుతున్నారు ఇక్కడి విద్యార్థులు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, భక్తిబాటలో నడుస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఎక్కడెక్కడి నుంచో వచ్చామనే భావన రాకుండా.. ఇంటికి దూరంగా ఉంటున్నామనే ఆలోచన దరిచేరకుండా కుటుంబసభ్యుల మాదిరిగా కలిసి మెలిసి వేడుకలు నిర్వహిస్తున్నారు. బోధకులను సైతం భాగస్వాములను చేస్తూ జిల్లా కేంద్రంలో సందడి వాతావరణాన్ని తీసుకొస్తున్నారు.



స్వాగతోత్సవంలో..



వైద్యవిద్యలో భాగంగా జిల్లా కేంద్రంలో శిబిరంలో పాల్గొంటూ..



కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ మండపం వద్ద విద్యార్థులు

ప్రతి ఉత్సవం.. కలిసికట్టుగా..

రెండు బ్యాచ్‌లు.. రెండు వందల మంది విద్యార్థులతో కళాశాల నిండుగా కనిపిస్తుంది. మొదటి ఏడాది విద్యార్థులు సీనియర్లుగా మారిపోయారు. రెండో ఏటా చేరిన వారు సైతం త్వరలో సీనియర్లు కానున్నారు. ఏటా వేడుకలను కలిసికట్టుగా నిర్వహిస్తున్నారు. మొదటి ఏడాది నుంచే క్రీడాదినోత్సవం, హోలీ, బ్యాచ్ పార్టీ, ఇఫ్తార్ విందు, పరీక్షల ఫలితాల అనంతరం వైభవోపేతంగా సరస్వతిపూజ, స్వాగతోత్సవం, ఆచార్యుల పదవీ విరమణ వేడుకలు, ఉపాధ్యాయ దినోత్సవం, ఇటీవల ఆధ్యాత్మిక వేడుకైన వినాయక విగ్రహ ఏర్పాటు ప్రత్యేక పూజలు, రోజుకో తీరు ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా ప్రతి వేడుకను ఓ పద్ధతిగా, చూడముచ్చటగా జరిపిస్తున్నారు. కళాశాలలో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంచుతున్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాల అనుమతి వచ్చింది.. సొంత భవనం లేదు. వసతి గృహాలు అందుబాటులోకి రాలేదు. అయినా 98 శాతం ఉత్తీర్ణతతో తొలి ఏడాదే రాష్ట్రం మొత్తం మంచిర్యాల వైపు చూసేలా చేశారు. 24 గంటలు పుస్తకాలకే పరిమితం కాలేదు.. ఆటపాటలకు దూరంగా అసలే లేరు. పేరుపొందిన వైద్య కళాశాలల మాదిరిగా ఇక్కడా అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. మంచిర్యాల వైద్య కళాశాలను ఔరా అనిపించేలా చేశారు.



తీరొక్క పూలతో.. బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థి కళాశాల విద్యార్థినులు



మావలలో బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు రంగురంగుల పూలతో తయారు చేసిన భారీ బతుకమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. బతుకమ్మ చుట్టూ నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవి, విద్యార్థి కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, బీనాదేవి దంపతులు, వైస్ ప్రిన్సిపాళ్లు శ్రవణ్, లక్ష్మారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, మావల



బతుకమ్మలు పట్టుకుని స్వీయచిత్రం దిగుతున్న విద్యార్థినులు



రిబ్బన్ కత్తిరించి పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఏకలవ్య గురుకుల పాఠశాలలు ప్రారంభం

ఉట్నూరు, న్యూస్‌టుడే : పీఎం గిరిజన ఉన్నత్ గ్రామ్ అభియాన్‌లో భాగంగా దేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలను బుధవారం ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఉట్నూరు, ఇంద్రవెల్లి(పాటగూడ)లో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ హాజరయ్యారు. తొలుత ఎంపీ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.45 కోట్లతో ఆధునిక పాఠశాల భవనం నిర్మించి గిరిజన విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించిందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో ఉచిత విద్యను అందిస్తోందన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లికి 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా గాంధీచౌక్ వద్ద పట్టుకున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆటోలో మహారాష్ట్రకు తరలిస్తున్న 5 క్వింటాళ్ల బియ్యాన్ని స్థానిక పంజాబ్ కూడలి వద్ద పట్టుకున్నామన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్‌అలీ, ఆర్ఐ రవీందర్‌లకు బియ్యాన్ని అప్పగించామన్నారు.

సర్కారుపైనే అన్నదాతల ఆశలు

- పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలపై నేడు సమావేశం
- బహిరంగ మార్కెట్లలో తగ్గిన ధరలు



ఆదిలాబాద్ మార్కెట్


న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

పత్తి పంట ఇంటికి చేరుతున్న తరుణంలో ధర తగ్గిపోయింది. మార్కెట్ మాయాజాలంతో రైతులు ఏటా దగా పడక తప్పడం లేదు. లోపభూయిష్టమైన నిబంధనలు ఇందుకు కారణమవుతున్నాయి. మద్దతు ధరతో పత్తి కొనుగోలు, కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలు, తదితర వాటిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం రైతులు, వ్యాపారులతో సమావేశం కానున్నారు. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో రైతుల ఇబ్బందులపై చర్చించనున్నారు. రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపడంతో పాటు, పత్తి గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది.

జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సాగు కష్టాలతోనే సాగింది. వరుస వర్షాలతో పంట ఏపుగా పెరిగినా.. కలుపు, తెగుళ్ల సమస్యతో పలుమార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. మొన్నటి వరకు బహిరంగ మార్కెట్లలో పత్తికి ధర ఎక్కువగా ఉండేది. పంట ఇంటికి వస్తున్న తరుణంలో ధర రూ.7,100కు తగ్గిపోయింది. సీసీఐ రైతుల నుంచి మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేస్తే మేలు జరుగుతుంది. గురువారం జరగనున్న సమావేశంలో ప్రధానంగా పత్తి కొనుగోళ్లలో నిబంధనలు, కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలపై చర్చించి రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సమస్యలు ఇవి.. పరిష్కరిస్తే మేలు

- వ్యాపారులకు చెందిన జిన్నింగ్‌లకు ఈ నెల 20 వరకు విద్యుత్తు విరామం ఉంది. అప్పటి వరకు పత్తి కొనుగోళ్లు ప్రారంభించే అవకాశం లేదు. విద్యుత్తు సరఫరాలో కొంత సడలింపు ఇప్పించి, దసరాలోపు పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటే రైతులకు మేలు జరుగుతుంది.
- మార్కెట్‌లో తక్కువ ధర ఉంటే.. మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ సిద్ధంగా ఉండాలి. జిల్లాలో 24 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని టెండర్లు పిలిచిన సీసీఐ కేంద్రాల ప్రారంభంపై అధికారికంగా ప్రకటించాలి.
- 12 శాతం కంటే తేమ ఎక్కువ ఉన్న పత్తికి ఒక ధరను ప్రకటించి సీసీఐ కొనుగోలు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.
- తేమ నిర్ధారణలో ఏటా సమస్య ఉంటోంది. మార్కెట్లో ఒక తీరుగా, జిన్నింగ్‌లో మరో తీరుగా వస్తోంది. తేమను మార్కెట్లో పరిశీలించి దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.
- రైతులకు గతంలో సద్దిమూట పేరిట రూ.5కే భోజనం అందించేవాళ్లు. దాన్ని తిరిగి కొనసాగిస్తే రైతుల ఆకలి తీర్చిన వారవుతారు.
- ఆధార్ నిర్ధారణ కోసం ఎక్కువ మంది సిబ్బందిని నియమించుకుంటే... రైతులు బారులు తీరి గంటల కొద్దీ వరుసలో నిలబడే బాధ తప్పుతుంది.



విక్రయానికి సిద్ధంగా రైతు ఇంట్లో పత్తి

బీఎస్ఎన్ఎల్ సేవల్లో అంతరాయం

భుక్తాపూర్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 2.40 గంటల వరకు బీఎస్ఎన్ఎల్ సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎవరికి ఫోన్ చేసినా అవి పని చేయక పోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2జీ టవర్లు డౌన్ అయ్యాయని, వాటిని క్రమబద్ధీకరించామని బీఎస్ఎన్ఎల్ సిబ్బంది పేర్కొన్నారు. 4జీ టవర్లు అందుబాటులో ఉండటంతో వాట్సాప్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా తమ పనులు చేసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, తాంసి:

? తాంసి మండలం లీమ్‌గూడ వైకుంఠధామంలో పిచ్చిమొక్కలు పెరిగి, ఇబ్బందిగా ఉంది. **- లక్ష్మణ్, లీమ్‌గూడ**

✔ పరిశీలించి, తొందరలోనే పంచాయతీ కార్మికులతో తొలగిస్తాం **- కార్తిక్, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, బోథ్:

? సొనాల నుంచి బోథ్ వెళ్లే మార్గంలో పలు చోట్ల మూలమలుపుల వద్ద చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించటం లేదు. **- వాహనదారుడు, బోథ్**

✔ మూలమలుపుల వద్ద పెరిగిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- జీవన్‌రెడ్డి, ఎంపీడీవో, బోథ్**

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని రైతు బజారులో కుళ్లిన కూరగాయలను అక్కడే ఓ మూలన పడేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. **- రామేశ్వర్, ప్రైవేటు ఉద్యోగి**

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి కుళ్లిన కూరగాయలను తొలగిస్తాం. అక్కడ పడేయకుండా వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం. **- నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

న్యూస్‌టుడే, తలమడుగు:

? తలమడుగు మండలం పల్లి(బి), పల్లి(కె) గ్రామాల రహదారులు గుంతలమయమై ప్రమాదకరంగా మారాయి. రహదారుల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనా ఎందుకు నిర్మాణ పనులు ప్రారంభించడం లేదు. **- అశోక్, పల్లి(బి)**

✔ పల్లి(బి), పల్లి(కె) గ్రామాల రహదారులకు నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన మాట వాస్తవమే. రహదారి పనులు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. **- రాజేష్, పంచాయతీరాజ్ డీఈ**

న్యూస్‌టుడే, గుడిహత్నూర్:

? గుడిహత్నూర్ మండలం జాతీయ రహదారి మేకలగండి వద్ద వేగ నిరోధకాలు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. **- సంజీవ్ ముండే, గుడిహత్నూర్ సహకారం సంఘం ఛైర్మన్**


✔ ప్రమాదాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. **- ఇమ్రాన్, ఎస్ఐ గుడిహత్నూర్**

న్యూస్‌టుడే, బేల:

? బేల టీచర్స్ కాలనీ, ఇంద్రనగర్ కాలనీల్లో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు పెరుగుతున్నాయి. **- సంజయ్, స్థానికులు**

✔ ఖాళీ స్థలాలను పరిశీలించి త్వరలో యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. లేకుంటే పంచాయతీ సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. **- సురేష్, పంచాయతీ కార్యదర్శి, బేల**

మహాత్ముడి అహింసావాదం.. ప్రపంచశాంతికి మంత్రం





జిల్లా జైలులో.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, కలెక్టర్ రాజర్షి షా



స్వచ్ఛ భారత్‌లో మున్సిపల్ ఛైర్మన్ ప్రేమేందర్, కమిషనర్ ఖమర్ అహ్మద్, తదితరులు



ఉట్నూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఆదిలాబాద్ : ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్, తదితరులు



ఇచ్చోడ : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

పాలనాప్రాంగణం, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ గ్రామీణం, ఎదులాపురం, ఆదిలాబాద్ వైద్య విభాగం, జైనథ్, ఇచ్చోడ(నేరడిగొండ), ఇచ్చోడ, సిరికొండ, ఉట్నూరు గ్రామీణం, ఉట్నూరు, ఆదిలాబాద్ క్రీడా విభాగం, గుడిహత్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, తలమడుగు: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అధికార వర్గాలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. సత్యం, అహింసా వాదంతో చేసిన స్వాతంత్రోద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. శాంతిని కాంక్షించే ఆయన సిద్ధాంతాలు ప్రపంచ దేశాలకు మార్గదర్శకమయ్యాయని కొనియాడారు. కొన్ని చోట్ల స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బీసీ స్టడీ సర్కిల్‌లో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అభ్యర్థులను పెన్నులు, ప్యాడ్లు, నోట్‌బుక్కులు అందజేశారు.



బోథ్‌లో వీధులను శుభ్రం చేస్తున్న నాయకులు, అధికారులు



బీసీ స్టడీ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న ప్రవీణ్ కుమార్, అభ్యర్థులు



డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు



జైనథ్: తహసీల్దార్ శ్యాంసుందర్, సిబ్బంది



జందాపూర్‌లో.. అధికారులు, గ్రామపెద్దలు



ఉట్నూరు : జనార్దన్ రాథోడ్, చారులత రాథోడ్



బరంపూర్ రైతువేదికలో...



నార్నూర్ : గజానంద్‌నాయక్



ఇంద్రవెల్లి : మర్కాగూడలో పుష్పలత, గ్రామస్థులు

నిందితులను ఉరి తీయాలంటూ ప్రదర్శన

ఎదులాపురం, న్యూస్‌టుడే : అత్యాచారాలకు పాల్పడిన నిందితులను ఉరి తీయాలంటూ డిమాండ్ చేస్తూ బుధవారం టైగర్ గ్రూప్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇటీవల పట్టణంలో ఒక మూడేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రూప్ ఉపాధ్యక్షుడు బట్టు మహేశ్ అన్నారు. సంఘం అధ్యక్షుడు జాదవ్ గోపాల్, శశికాంత్, తౌఫీక్, షహేబాజ్, దినేష్, సాయికుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంపీహెచ్ డబ్ల్యూ శిక్షణ పొందుతున్న విద్యార్థిని(20) అదృశ్యమైనట్లు మావల పోలీసులు బుధవారం కేసు నమోదు చేసినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఆమె చరవాణి మంగళవారం ఉదయం నుంచి స్విచ్ఛాఫ్ అయింది. సోదరుడు పలుమార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోవటంతో బుధవారం కళాశాలకు వచ్చి వాకబు చేయగా జాడ తెలియరాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో భారాస కార్యకర్త మృతి

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే : గుండెపోటుతో బజార్‌హత్నూర్‌కు చెందిన భారాస కార్యకర్త భగత్ వినోద్(39) తన పంట పొలంలో బుధవారం మధ్యాహ్నం కుప్పకూలాడు. పొరుగు వారు గమనించేలోపే చనిపోయాడు. అతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జూదరులపై కేసు నమోదు

ఇచ్చోడ(నేరడిగొండ): నేరడిగొండ మండలం కుమారి శివారులో జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది.

దర్జీ కూతురికి డాక్టరేట్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ డైట్ కళాశాలలో సైకాలజీ అధ్యాపకురాలిగా పని చేస్తున్న సింగు గంగామణి డాక్టరేట్ పట్టా పొందారు. తమిళనాడులోని చెన్నై టీచర్స్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం నుంచి విద్యావిభాగంలో డాక్టరేట్ సాధించగా.. ఆ రాష్ట్ర గవర్నర్ యన్.వి. రవి చేతుల మీదుగా బుధవారం పట్టాను అందుకున్నారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన దర్జీ రాజన్న-అనసూయ దంపతుల కూతురైన గంగామణి భర్త రవికుమార్ ప్రోత్సాహంతో డాక్టరేట్ సాధించినట్లు పేర్కొన్నారు. డీఎడ్, బీఎడ్ కోర్సులో నాలుగు పుస్తకాలు రాసి ఆయా పరిశోధనలకు పట్టా అందుకున్నట్లు ఆమె వివరించారు.

భవిష్యత్తు వైద్యులు.. ఈ పల్లె విద్యార్థులు

భీంపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థులు భవిష్యత్తు వైద్యుల అవతారం ఎత్తనున్నారు. అర్లి-టి గ్రామానికి చెందిన మస్కాపూర్ లచ్చన్న-నీరజ దంపతుల కుమారుడు ప్రణీత్ మంగళవారం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందారు. కరంజి-టి గ్రామానికి చెందిన రైతు రెడ్డి శంకర్ కుమారుడు శివయాదవ్ ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యలో చేరారు. సామాన్య కుటుంబాలకు చెందిన వీరిద్దరూ నీట్ ఫలితాల్లో సత్తా చాటి ఉమ్మడి జిల్లాలోని ఆయా వైద్యకళాశాలల్లో ప్రవేశం పొందడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కరంజి-టి వాసి రెడ్డి శివయాదవ్



రిమ్స్ కళాశాల డైరెక్టర్ నుంచి ప్రవేశం పొందుతున్న అర్లి-టి విద్యార్థి ప్రణీత్

రాష్ట్ర ర్యాంకర్‌ను అభినందించిన ఎస్పీ



షిరీన్ పర్వీన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఆదిలాబాద్ నేర విభాగం, నార్నూర్, న్యూస్‌టుడే : పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు ప్రతిభతో ఉన్నత స్థానాలను సాధించాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆకాంక్షించారు. జిల్లాకు చెందిన కానిస్టేబుల్ షేక్ ఇంజముల్ హక్ సోదరి షిరీన్ పర్వీన్ ఇటీవల వెలువడిన స్కూల్ అసిస్టెంట్ ఫలితాల్లో ఉర్దూ మాధ్యమంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించటంతో ఆమెను సన్మానించారు. అన్నయ్య ప్రోత్సాహంతో మొదటి ర్యాంకు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

మాజీ సర్పంచి మృతి

భీంపూర్, న్యూస్‌టుడే : పిప్పల్‌కోటి గ్రామ మాజీ సర్పంచి జాదవ్ ప్రేమలబాయి(62) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సంతాపం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లనే కూలగొడతారా?



నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి నిర్మాణ పత్రం చూపిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ పేరిట కట్టించిన ఇళ్లనే ఇప్పుడు అదే పార్టీ ప్రభుత్వం ఆక్రమణల సాకుతో కూల్చాలని చూస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన పట్టణంలోని ఖానాపూర్ కాలనీని సందర్శించారు. కాలనీవాసులకు ధైర్యం చెప్పారు. నాయకులు లాలామున్నా, ఆకుల ప్రవీణ్, జోగురవి, అశోక్‌రెడ్డి, కృష్ణయాదవ్, రాజేష్, అర్జున్, విజయ్ తదితరులు ఉన్నారు.

మొదటి ఏడాది ఎంబీబీఎస్‌లో 51 మంది చేరిక

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో రాష్ట్ర కోటా మొదటి విడత ఎంబీబీఎస్ ప్రవేశాల్లో బుధవారం నాటికి 51 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. తొలి ఏడాది ప్రవేశాలు పొందే విద్యార్థుల సౌకర్యార్థం ధ్రువపత్రాల పరిశీలన కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. మొదటి విడత రిమ్స్‌కు 75 సీట్లు కేటాయించగా ప్రవేశాలకు గురువారం గడువు ముగియనుంది.

పదవీ విరమణ పొందిన జవాన్‌కు ఘన స్వాగతం

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : మండలంలోని తోషం గ్రామానికి చెందిన వైజనాథ్ సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా 34 ఏళ్లు విధులు నిర్వహించి పదవీ విరమణ పొంది బుధవారం గుడిహత్నూర్‌కు వచ్చారు. ఆయనకు మండల యువకులు పూలమాలలు సన్మానించారు. గుడిహత్నూర్ నుంచి తోషం వరకు ర్యాలీ నిర్వహించారు. తోషంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ పాల్గొని మాట్లాడారు. ఆయన సేవలను కొనియాడారు. రవీందర్, విజయ్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బాలాజీ, జమీల్ తదితరులు పాల్గొన్నారు.



జవాన్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

కుల వివక్ష లేని సమాజ నిర్మాణమే ధ్యేయం

ఎదులాపురం: కుల వివక్ష లేని సమసమాజ నిర్మాణమే కేవీపీఎస్(కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పవార్ జితేందర్ అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జెండా ఆవిష్కరించారు. మల్లేష్, ప్రేమేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఇప్పిస్తా: ఎంపీ

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : అటవీ శాఖ అడ్డంకులతో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రత్యేకంగా నివేదిక పంపితే తప్పకుండా కేంద్ర అటవీ శాఖ అనుమతి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం పాటగూడలో రూ.24 కోట్లతో నిర్మించిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలను ప్రారంభించారు. రహదారులు లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అధికారులు వెంటనే ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆర్‌సీఓ అనిల్, పాల్గొన్నారు.



విద్యార్థినులతో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే బొజ్జు, పీఓ ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

బతుకమ్మ సంబరం



తలమడుగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పోగొట్టుకున్న చరవాణి అందజేత

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : శాంతినగర్‌కు చెందిన షేక్ సాదిఖ్ గత నెల 5న పోగొట్టుకున్న చరవాణిని ఆయనకు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ బుధవారం అందజేశారు.

ఉద్యోగులుగా గుర్తించాలి

ఇచ్చోడ(నేరడిగొండ), న్యూస్‌టుడే : టోల్ ప్లాజా కార్మికులను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగులుగా గుర్తించాలని టోల్ ప్లాజా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

టీఏజీఎస్ జిల్లా కార్యదర్శిగా తొడసం భీంరావు

ఎదులాపురం, న్యూస్‌టుడే : తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శిగా తొడసం భీంరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సచిన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

దాడి కేసులో 13 మంది రిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఇరు వర్గాలు దాడుల ఘటనలో 13 మంది నిందితులను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కరుణాకర్‌రావు వివరాల ప్రకారం.. మహాలక్ష్మీవాడకు చెందిన యోగేష్‌కు డీజే అద్దె డబ్బులను వికాస్ ఇవ్వాల్సి ఉంది. ఆ డబ్బుల విషయమై ఇరువురి మిత్రులు రైల్వే స్టేషన్‌లో దాడులు చేసుకున్నారు. యోగేష్ వర్గానికి చెందిన ఆరుగురిని, వికాస్ వర్గానికి చెందిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి...

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఇటీవల పట్టుబడ్డ గంజాయి కేసులో నిందితుడైన మహారాష్ట్రకు చెందిన షేక్ ఈసాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

జోనల్‌స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్ క్రీడావిభాగం: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు ముగిశాయి. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశామని, వారు మంచిర్యాలలో నిర్వహించే జోనల్‌స్థాయి(ఉమ్మడి జిల్లా) కరాటే పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కాంతారావు, పోటీల నిర్వాహకుడు రాష్ట్రపాల్ తెలిపారు.

ఎట్టకేలకు క్రీడా పరికరాలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు పరికరాలు లేక విద్యార్థుల సాధన అగమ్యగోచరంగా మారింది. వారు సరిగా సాధన చేయలేక, పోటీల్లో రాణించలేక వెనుకంజ వేస్తున్నారని 'ప్రవేశాలు లేవు.. పరికరాలూ కరవు..' శీర్షికతో 'ఈనాడు' ప్రధాన సంచికలో కథనాన్ని ప్రచురించింది. ఎట్టకేలకు రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారులు స్పందించారు. తాజాగా రూ.3.42 లక్షల విలువైన జూడో, బాక్సింగ్ క్రీడాంశాలకు సంబంధించిన కొంతమేర పరికరాలు పంపిణీ చేశారు. జూడోకు సంబంధించిన ట్రైనింగ్ మ్యాట్లు, దుస్తులు, థెరా బ్యాండ్లు, త్రోయింగ్ డమ్మీస్, బాక్సింగ్‌కు సంబంధించిన రింగ్, పంచింగ్ బ్యాగ్స్, గ్లౌజులు, దుస్తులు(ఎరుపు, నీలం) అవసరమవుతాయని శిక్షకులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జన్మనిచ్చిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పోషించాల్సిన బాధ్యత వారసులపై ఉందని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని కేఆర్కే కాలనీలో షెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వయోవృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ సురేందర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు గంగేశ్వర్ తదితరులున్నారు.

కత్తితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం రాంపూర్ వంతెన సమీపంలో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామీణ ఎస్ఐ ముజాహిద్ వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ఇస్రాయిల్‌పై లక్సెట్టిపేటకు చెందిన సమీప బంధువు అయిన అఫ్రోజ్‌తో పాటు మరో అయిదుగురు కత్తితో దాడి చేశారు. అక్రమ సంబంధం పెట్టుకున్నారన్న అనుమానంతో మాట్లాడుకుందామని ఇస్రాయిల్‌ను ఆదిలాబాద్‌లోని రాంపూర్ వద్దకు రప్పించి దాడికి పాల్పడ్డారు. అతడు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించకుంటే ఆందోళనలు

బేల, న్యూస్‌టుడే : బూరాన్‌పూర్ శివారులోని సర్వే నెం.29/ఏలో అక్రమ నిర్మాణాలు ఎందుకు తొలగించడం లేదని కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను ప్రశ్నించారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిని కలిసి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించడం లేదన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు నందు, రాయిసెంటర్ అధ్యక్షుడు కొరంగే సోనేరావు, అడ సంతోష్, కొరంగే జంగ్‌షా ఉన్నారు.

చేతులు కలిపారు..
బడిని బతికించారు

న్యూస్‌టుడే, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ :

గ్రామస్థుల తోడ్పాటు, తల్లిదండ్రుల అండ, గ్రామ ఉద్యోగుల సహకారం వెరసి ఆ ప్రభుత్వ బడి నేడు సమస్యలు లేని ఆదర్శ బడిగా రూపుదిద్దుకుంది. అదే బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.

బజార్‌హత్నూర్ మండలం పిప్పిరిలో గతేడాది 50 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసించే వారు. పిల్లల సంఖ్య తగ్గడంతో గ్రామాభివృద్ధి కమిటీతో పాటు పిల్లల తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇద్దరే ఉండటం కారణంగా కనిపించింది. సమస్యను పరిష్కరించేందుకు వీడీసీ ఆధ్వర్యంలో ఒక వాలంటీరును నియమించారు. అతడికి నెలకు రూ.7,500 పారితోషికం అందించారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే పిల్లల పోషకులు, వీడీసీ, గ్రామ ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులు సమావేశమయ్యారు. పాఠశాలలోని సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా అడుగులు వేశారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గ్రామస్థులు నియమించిన విద్యా వాలంటీరు



పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఇలా ముందుకు సాగుతున్నారు

పాఠశాల ప్రారంభంలోనే గ్రామస్థులంతా సమావేశమయ్యారు. ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో అప్పటికే కొనసాగుతున్న వీవీతో పాటు పోషకులు తమ సొంత ఖర్చులతో మరో వీవీని నియమిస్తామని ముందుకొచ్చారు. ఇందుకు ఒక కమిటీని నియమించుకున్నారు. ప్రతి నెల అతడికి రూ.6 వేల పారితోషికం అందిస్తున్నారు. దాతల సహాయంతో కుర్చీలను అందించారు. రూ.40 వేలు ఖర్చు చేసి రెండు గేట్లను ఏర్పాటు చేశారు. రూ.10 వేల ఖర్చుతో బీరువా కొన్నారు. రూ.10 వేలతో ఐడీ కార్డులు అందించారు. ఓ స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో 70 బ్యాగులు అందించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 67కి చేరింది. ఇటీవల ఒక ఉపాధ్యాయుడు రావడంతో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఇద్దరు వాలంటీర్లు అక్కడ పని చేస్తున్నారు. బడి తోటతో పాటు పరుచుకున్న పచ్చదనం పాఠశాలకు ఎంతో అందాన్నిస్తుంది.

చాలా సంతోషంగా ఉంది

- సురేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల అభివృద్ధికి పిల్లల పోషకులు, వీడీసీ సంఘం సభ్యులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ తోడ్పాటుతో పాటు గ్రామస్థుల సహకారంతో పాఠశాలను తీర్చిదిద్దుకుంటున్నాం.

ఇక్కడే చదివిస్తాం

- రాజేందర్, పోషకుడు



ప్రైవేటులో వేలల్లో ఫీజులు కట్టి చదివించే స్తోమత లేదు. పాఠశాలలో సమస్యలు తీర్చేందుకు వీడీసీతో పాటు దాతలు ముందుకొస్తున్నారు. మేము కూడా కొంత మా పిల్లల కోసం ఖర్చు చేస్తున్నాం. నాణ్యమైన విద్య ఇక్కడే దొరుకుతోంది.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య

- భోజారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు పిప్పిరి



ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుంది. మా సంఘ సభ్యులంతా కలిసి చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకొని బడిని బాగు చేసుకుంటున్నాం. పిల్లలను పోషకులు ప్రభుత్వ బడికి పంపడమే మా కోరిక.

దుమ్ము దులిపేస్తోంది..!

● సింగరేణిలో వాయు కాలుష్య నియంత్రణ యంత్రం ప్రారంభం

ఇలా పనిచేస్తుందంటే..

బొగ్గు గనుల ప్రాంతంలో వాయు కాలుష్య నియంత్రణ, కార్మిక సంక్షేమానికి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. రోడ్లపై దుమ్ము, ధూళిని నియంత్రించేందుకు కదిలే వాయు కాలుష్య (ఫాగ్ కెనాన్) యంత్రాన్ని బెల్లంపల్లి ఏరియాలో గత నెల 25న ప్రారంభించింది. గనుల ఏర్పాటులో భాగంగా ఈసీ సూచన మేరకు తొలిసారిగా దీన్ని ఏర్పాటు చేశారు. మూడేళ్ల కాలపరిమితితో టెండరు ప్రక్రియ ద్వారా రూ.1.23 కోట్ల వ్యయం చేశారు. ఒక లారీకి నీటి ట్యాంకర్, 30 కేవీ జనరేటర్‌ను బిగించారు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చిన ఈ యంత్రాన్ని లారీకి వెనుక భాగంలో అమర్చారు. లారీ నడుస్తున్న తరుణంలో దాని నుంచి నీళ్ల తుంపర్లు దూసుకొని వస్తుంటాయి. దీంతో దుమ్ము నివారణతో పాటు గాలిలోని కాలుష్యాన్ని నివారించేందుకు దోహదపడుతుంది.



సింగరేణి అంటే బొగ్గు గనులతో కూడిన ప్రాంతం. నిత్యం బొగ్గు లారీలు, పెద్ద వాహనాల రాకపోకలతో రోడ్ల వెంబడి దుమ్ము, ధూళి విపరీతంగా వ్యాపిస్తుంటుంది. వాయు కాలుష్యానికి కారణమవుతుంది. యాజమాన్యం ఏటా లక్షల కోట్ల మొక్కలు పెంచుతూ కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నా.. మరింత నియంత్రణకు ఆధునిక సాంకేతికతో కూడిన ఓ యంత్రాన్ని కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాలో గనులు విస్తరించి ఉండగా.. బెల్లంపల్లి ఏరియాలో మొదటగా ఈ యంత్రాన్ని ప్రవేశపెట్టింది.

ఏయే ప్రాంతాల్లో..

ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి సీహెచ్‌పీ వరకు సింగరేణి రహదారి మీదుగా నిత్యం బొగ్గు లారీల రాకపోకలు కొనసాగుతుంటాయి. ఈ యంత్రాన్ని ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి టౌన్‌షిప్, దుబ్బగూడెం, భగత్‌సింగ్‌నగర్, రేపలగూడ, గోలేటి క్రాస్ రోడ్డు మీదుగా గోలేటి సీహెచ్‌పీ వరకు నిత్యం తిప్పుతుంటారు. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ యంత్రం ఎంతో దోహదపడుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు.

- న్యూస్‌టుడే, గోలేటి టౌన్‌షిప్

నర్సరీల ఏర్పాటుపై దృష్టి సారించాలి

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 సంవత్సరానికి గాను నిర్దేశించిన ప్రణాళికను అమలుచేయాలన్నారు. పనులను గుర్తించి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని ఈ నెల 5లోగా గుర్తించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీవో కిషన్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి పాల్గొన్నారు.

బాలాలయంలోనే..
గంగనీళ్ల ఉత్సవాలు

● శని, ఆదివారాల్లో జాతర



బాలాలయంలో పోచమ్మ తల్లి

సారంగాపూర్, న్యూస్‌టుడే: వరుసగా రెండో ఏడాది 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు అడెల్లి మహా పోచమ్మ బాలాలయంలోనే జరగనున్నాయి. నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చినా అమ్మవారిని ఆలయంలో ప్రతిష్ఠించనందున నూతన ఆలయం ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నెల 5, 6వ తేదీల్లో జాతర జరగనుండగా ఈవో రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దసరాకు ముందు వచ్చే మహాలయ అమావాస్య తదుపరి శని, ఆదివారాల్లో గంగనీళ్ల జాతర జరపడం ఆనవాయితీ. శనివారం ఉదయం 11 గంటలకు బాలాలయంలో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలుచేసి, అమ్మవారి ఆభరణాలతో ఆలయ సేవాదారులు శోభాయాత్రగా గోదావరి నదికి పయనమవుతారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలం మాడెగాం, దిలావర్‌పూర్, కంజర్, సాంగ్వి గ్రామాల నుంచి సాయంత్రానికి గోదావరి తీరానికి చేరుతుంది. రాత్రికి అక్కడే జాగరణ చేస్తారు. ఆదివారం వేకువ జామున గోదావరి నీటితో ఆభరణాలను శుద్ధి చేసి పాదయాత్రగా తిరిగి అదే మార్గంలో సాయంత్రానికి పోచమ్మ ఆలయానికి చేరుకుంటారు. తీసుకొచ్చిన జలాలను స్థానిక కోనేటి నీటితో కలిపి అమ్మవారికి అభిషేకం చేసి ఆభరణాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం భక్తులు దర్శించుకోవడంతో జాతర ముగుస్తుంది.

ఏర్పాట్లు పూర్తి:

జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశాం. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయినా మందిరం ప్రారంభం కాకపోవడంతో బాలాలయంలోనే జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాం. నిర్మల్, భైంసా డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు సైతం నడపాలని విజ్ఞప్తి చేశాం. -రమేష్, ఆలయ ఈవో

సామాజిక మాధ్యమాల పోస్టులపై ప్రత్యేక నిఘా

మంచిర్యాలనేరవిభాగం : చట్టవ్యతిరేకమైన పలు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మతాన్ని, కులాన్ని ద్వేషించేలా చేస్తున్న పోస్టులపై పోలీసుల నిఘా ఉందని, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి ఒడిలో దేవాపూర్!



ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో దేవాపూర్ గ్రామం

అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ వర్షాలతో పచ్చదనం సంతరించుకుంది. కొండాకోనల్లో ఎక్కడ చూసినా జలపాతాల గలగలలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. గూడేలు, తండాలే కాదు పెద్ద పంచాయతీలు సైతం పచ్చదనం మాటున దాగి ఉన్నాయి. సాధారణంగా కొండాకోనల్లో దట్టమైన అడవుల్లో అయిదు నుంచి పది ఇళ్లు ఉండే చిన్న తండాలు దూరం నుంచి చూడటానికి అందంగా కనిపిస్తాయి. అక్కడ పూర్తిస్థాయిలో ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో ఉండవు. ఇక్కడ మీకు ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో అందంగా కనిపిస్తున్న ఈ గ్రామం తలమడుగు మండలం దేవాపూర్. మండలంలోనే మేజర్ పంచాయతీగా పేరు పొందింది. ఇక్కడ 865 కుటుంబాలు ఉండగా జనాభా 2,955 మంది ఉన్నారు. ఎటు చూసినా పచ్చదనంతో పాటు చల్లని వాతావరణం వీరి సొంతం. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటంతో పక్కనే ఆదిలాబాద్ పట్టణం సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. అక్కడ ఉండేందుకు ఇక్కడి ప్రజలు ఇష్టపడరు. - ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, తలమడుగు

51 ఏళ్లుగా ఒకే తరహా విగ్రహాలు

● మందమర్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకత



పూజలు అందుకోనున్న దేవతామూర్తుల విగ్రహాలు

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం: మంచిర్యాల జిల్లా మందమర్రి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో మాత్రం భిన్నం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి సహకారంతో ఇక్కడ దేవీ శరన్నవరాత్రి వేడుకలను 1974 సంవత్సరం నుంచి 51 ఏళ్లుగా అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. సింగరేణి బొగ్గు గనులు ప్రారంభించిన కొత్తలో పశ్చిమబెంగాల్ నుంచి అధికారులు ఏళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ క్రమంలో కోల్‌కతా నగరంలో ప్రతిష్ఠించే కాళీమాత విగ్రహాన్ని పోలిన విధంగా ఇక్కడ అదే తరహా ప్రతిమలను తయారు చేయిస్తున్నట్లు పూజారి అనంతాచార్యులు తెలిపారు.

కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన కళాకారులు రెండు నెలల పాటు శ్రమించి మట్టి, గడ్డితో 7-8 అడుగుల విగ్రహాన్ని తయారు చేశారు. అమ్మవారి విగ్రహంతో పాటు వినాయకుడు, కుమారస్వామి, లక్ష్మీదేవి, సరస్వతి దేవి విగ్రహాన్ని సిద్ధం చేశారు. మొదటి నుంచి ఒకే తరహాలో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు మందమర్రి, మంచిర్యాల, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి సుమారు 80 వేల మంది భక్తులు వస్తుంటారు. దసరా రోజు రాత్రి ఇక్కడ పూజలు నిర్వహించిన తర్వాతనే సింగరేణి మైదానంలో సింగరేణి యాజమాన్యం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రామ్‌లీలా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు.



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి

అంబరం.. క్రీడా సంబరం

● ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: క్రికెట్ అంటే అందరూ ఎంతో ఆసక్తి కనబరుస్తుంటారు. ఆ ఆటకు ఉన్న గుర్తింపే వేరు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను చూసి వారిలాగే తామూ ఎదగాలని దానిపై మక్కువ పెంచుకున్న ఎంతో మంది నిత్యం తర్ఫీదు పొందుతుంటారు. వివిధ టోర్నీల్లో ఆడి తమదైన ఆట తీరును ప్రదర్శిస్తుంటారు. అలాంటి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వీటిని చేపట్టగా ఉమ్మడి జిల్లాకు చెందిన నాలుగు జట్ల బాలురు హాజరయ్యారు. నాలుగు జిల్లాల మధ్య పోటీలు పోటాపోటీగా సాగాయి. ఫైనల్‌లో మంచిర్యాల, నిర్మల్ జిల్లా జట్లు తలపడగా విజేతగా నిర్మల్ జిల్లా నిలిచింది. విజేత జట్టు ఈనెల 7 నుంచి 10వ తేదీ మధ్య జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.



తలపడుతున్న జట్లు

అట్టహాసంగా ప్రారంభం

పోటీలకు నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి ఆటపై ఉన్న మక్కువ చూపి టోర్నీ ప్రారంభించారు. అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని నిత్యం తర్ఫీదు పొందుతూ లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, దిలావర్‌పూర్ ఎంఈవో కె.శంకర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ పార్థసారధి, పెటా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భుక్య రమేష్, కె.భోజన్న, క్రీడల నిర్వాహకుడు వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రపాల్, సాయి, గోపాల్, భూమేష్, రాంరాజ్, శ్రీనివాస్, సంతోష్, సునీల్, సుదర్శన్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచి..:



మాది తాంసి మండలం పొన్నారి గ్రామం. తల్లిదండ్రులు లతీష్‌రెడ్డి-గీతారెడ్డి వ్యవసాయం చేస్తుంటారు. నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. మక్కువను గుర్తించి అమ్మానాన్న నన్ను ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ అక్కడే ఓ శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాను. గత ఏడాది ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనగా నాలోని ప్రతిభను చూసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. జడ్చర్లలో జరిగిన టోర్నీలో ఉత్తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడంతో నేషనల్‌కు ఎంపిక చేశారు. అయితే ఆ పోటీలు జరగలేదు. దీంతో అందులో పాల్గొనే అవకాశం రాలేదు. - ఓం క్షిరాజ్‌రెడ్డి, ఆదిలాబాద్

ఆల్‌రౌండర్‌గా..: సోమ ఇషాన్‌రెడ్డి, ఆదిలాబాద్



ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాను. ఏడేళ్ల ప్రాయంలో క్రికెట్‌పై మక్కువ పెరిగింది. మాది జైనథ్ మండలం పెండల్‌వాడ. తల్లిదండ్రులు ప్రభాకర్‌రెడ్డి-రాధారెడ్డి వ్యాపారం చేస్తుంటారు. నాలోని అభిరుచి గుర్తించి వారు నన్ను ఓ ప్రైవేటు శిక్షణ కేంద్రంలో చేర్పించారు. అక్కడ తర్ఫీదు పొందుతూ వివిధ పోటీల్లో పాల్గొన్నాను. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాను. గత సంవత్సరం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో జరిగిన జోనల్ స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతోపాటు అక్కడ మంచి ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. అవి జరగకపోవడంతో ఆడే అవకాశం కోల్పోయాను.

రెండు నెలల వ్యవధి..
తండ్రీకుమార్తెలకు టీచరు కొలువులు

అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, భార్యాభర్తలు ఉద్యోగాలు సాధించడం సాధారణం. ఇందుకు భిన్నంగా రెండు నెలల వ్యవధిలో తండ్రీకుమార్తెలు టీచరు కొలువులకు ఎంపికయ్యారు. వారే జైనథ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన వాయిలే రమేష్, ప్రణయశ్రీ. ఆగస్టు 2న సోషల్ వెల్ఫేర్ సొసైటీ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బాలుర గురుకులంలో హిందీ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)గా వాయిలే రమేష్ ఎంపికై విధుల్లో చేరారు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ప్రణయశ్రీ ఎంపికయ్యారు. ఓపెన్ కేటగిరీలో 42వ ర్యాంకును సాధించిన ఆ యువతి తండ్రితో కలిసి బుధవారం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. కొంతకాలంగా తండ్రీకుమార్తెలు తమ గ్రామంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో టీచర్లుగా పని చేస్తుండగా.. ఒకరి తర్వాత మరొకరు ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావడం విశేషం. ఇంటి నుంచి ఒక్కరికే ఉద్యోగం రావడం గగనంగా మారిన ప్రస్తుత తరుణంలో తండ్రి 48 ఏళ్ల వయసులో.. ఆయన కుమార్తె 20 ఏళ్ల ప్రాయంలో సర్కారు కొలువులు సాధించి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారు. వయోపరిమితి గడువు ముగుస్తున్న సమయంలో తనకు ఉద్యోగం రావడం సంతృప్తినిస్తే.. ఇప్పుడు అందరూ తండ్రికి తగ్గ తనయ అని కూతురిని పొగుడుతుంటే మనసు ఉప్పొంగుతోందని రమేష్ ఆనందం వ్యక్తం చేశారు.



ఎస్జీటీగా ఎంపికైన కుమార్తె ప్రణయశ్రీతో కలిసి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన తండ్రి రమేష్

- ఈనాడు - ఆదిలాబాద్
- న్యూస్‌టుడే - పాలనాప్రాంగణం

జాతీయస్థాయి ఖోఖోలో తెలంగాణ జట్టుకు రజతం



రజత పతకం సాధించిన తెలంగాణ జట్టు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఝార్ఖండ్‌లో నిర్వహించిన 34వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు రజత పతకం సాధించింది. తుది పోరులో మహారాష్ట్ర జట్టుతో హోరాహోరీగా పోరాడి ఒక్క పాయింట్ తేడాతో ఓడి రన్నరప్‌గా నిలిచింది. తెలంగాణ జట్టులో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు సిడాం శంకర్, కుమ్ర సురేందర్, రాథోడ్ శివసాయి, ఆత్రం శివచరణ్, పెందూర్ హన్మంతు, ఆత్రం యాదవ్‌షావ్ ఉండడం విశేషం. క్రీడాకారులను ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, డీడీ ఎ.వసంత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి వేంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ పీడీ దయానంద్ రెడ్డి, తెలంగాణ జట్టు కోచ్ శివకృష్ణ, ఉమ్మడి జిల్లా ఖోఖో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్, శ్రీధర్‌రెడ్డి అభినందించారు.